

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.అప్పలనాయుడు

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్) ప్రిన్సిపాల్‌గా డా.ఎస్.అప్పలనాయుడు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన విజయనగరం సర్వజన ఆసుపత్రిలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో హెచ్ఓడీగా పని చేశారు. రిమ్స్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆసుపత్రి హెచ్ఓడీలు, వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

గురుదేవోభవ

- జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయినులకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డుల ప్రదానం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా అవార్డులు ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయినులు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు శ్రీకాకుళంలోని అంధవరపు వరం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీ పండితురాలు తిమ్మరాజు నీరజ, జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూర్మాన అరుణకుమారి, మెళియాపుట్టి మండలం నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరవల్లి విజయభారతి.. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.


సీఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న తిమ్మరాజు నీరజ, బి.విజయభారతి, కె.అరుణకుమారి (కుడి నుంచి ఎడమకు..)

నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం

- క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ఘనంగా గురుపూజోత్సవం
- జిల్లాలో 60 మంది ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

గుజరాతీపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుని విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పంచాయతీలకు నిధులొచ్చాయ్

- రూ. 32.51 కోట్లు జమ

శ్రీకాకుళం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల విడుదల చేసింది. ఇప్పటికే జిల్లాపరిషత్‌లకు వాటాలు కేటాయించింది. తాజాగా మండలాల వారీగా పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సర రెండో విడత నిధులు జమయ్యాయి. జిల్లాలోని 30మండలాల్లో అన్ని గ్రామ పంచాయతీలకు మొత్తం రూ.32,51,05,545 నిధులు మంజూరయ్యాయి. వీటిని పంచాయతీ ఖాతాల్లో జమచేశారు. ఈ నిధులతో పారిశుధ్య నిర్వహణ, పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

మండలం	పంచాయతీలు	ఆర్థిక సంఘం నిధులు (రూ.)
ఆమదాలవలస	30	72,19,735
బూర్జ	28	71,31,345
ఎచ్చెర్ల	26	1,24,20,030
జి.సిగడాం	31	96,28,428
గార	25	1,24,77,065
హిరమండలం	23	79,78,650
ఇచ్ఛాపురం	21	80,11,190
జలుమూరు	40	94,43,032
కంచిలి	31	1,27,29,732
కవిటి	23	1,29,92,766
కోటబొమ్మాళి	37	1,19,98,247
కొత్తూరు	43	1,67,21,439
ఎల్.ఎన్.పేట	22	58,11,616
లావేరు	26	96,66,201
మందస	41	1,69,20,683
మెళియాపుట్టి	37	1,28,89,908
నందిగాం	37	1,05,59,821
నరసన్నపేట	34	1,18,34,069
పలాస	18	67,78,287
పాతపట్నం	34	1,31,74,222
పోలాకి	29	1,00,37,244
పొందూరు	29	1,15,69,274
రణస్థలం	31	1,32,20,938
సంతబొమ్మాళి	34	1,08,32,753
సారవకోట	35	1,14,85,944
సరుబుజ్జిలి	21	54,57,583
సోంపేట	23	1,22,06,167
శ్రీకాకుళం	23	96,11,717
టెక్కలి	27	1,33,25,659
వజ్రపుకొత్తూరు	37	1,09,71,800
		మొత్తం: 32,51,05,545



చాకిపల్లి పంచాయతీ కార్యాలయం


థర్మల్ ప్రాజెక్టు కోసం వెన్నెలవలస సమీపంలో అధికారులు పరిశీలించిన భూములు

జిల్లాలో థర్మల్ ప్రాజెక్టు

- సరుబుజ్జిలి మండలంలో నిర్మాణానికి ఏపీ జెన్‌కో ప్రతిపాదన
- ఒక్కోటి 800 మెగావాట్ల చొప్పున.. నాలుగు యూనిట్లు
- రూ.30వేల కోట్లు అవసరమని అంచనా

శ్రీకాకుళం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలంలో థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఏపీ జెన్‌కో సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. వెన్నెలవలస వద్ద 3,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఒక్కొక్కటి 800 మెగావాట్ల చొప్పున నాలుగు యూనిట్లను జెన్‌కో సొంతంగా నిర్మించనుంది. డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును ఢిల్లీకి చెందిన దేశీఇన్ సంస్థ రూపొందించనుంది. ప్రాజెక్టు ఏర్పాటు చేసే ప్రాంతంలో టోపోగ్రఫికల్ సర్వే పనులను ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌కు అప్పగించింది. జియో టెక్నికల్ పరిశీలన పనులను ఆంధ్రా యూనివర్సిటీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహిస్తోంది. కొన్నాళ్ల కిందట అధికారులు సరుబుజ్జిలి మండలం చిగురువలస పంచాయతీలోని వెన్నెలవలస, శ్రీరాములవలస, లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో భూములను పరిశీలించారు. అలాగే ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా కొన్నాళ్ల కిందట జెన్‌కో బృందంతో సమీక్ష నిర్వహించారు. థర్మల్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.30వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. మూలపేట నౌకాశ్రయానికి దగ్గరగా ఏర్పాటు చేస్తే ఒడిశా నుంచి సముద్రమార్గంలో బొగ్గు సులభంగా (మిగతా 6వ పేజీలో..)

ఉద్దానంలో ఎలుగుల హల్‌చల్

- ఒకరిపై దాడి
- ఆందోళనలో ప్రజలు

హరిపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మందస మండలం నారాయణపురం, పెద్దకేసుపురం, గుజ్జులూరు తదితర గ్రామాల పరిధిలో ఎలుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నారాయణపురానికి చెందిన గొరకల పాపారావు తోటకు వెళ్తుండగా.. ఒక ఎలుగుబంటి దాడి చేసింది. చేతిలో కర్ర ఉండటంతోపాటు స్థానికులు అక్కడికి చేరుకోవడంతో చిన్నచిన్న గాయాలతో పాపారావు తప్పించుకున్నాడు. బాధితుడ్ని హరిపురం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దాడి అనంతరం స్థానికులు ఆ ఎలుగుబంటిని తరిమేయడంతో తోటల్లోకి వెళ్లిపోయింది. అదే సమయంలో పెద్దకేసుపురం, గుజ్జులూరు తోటల్లో మరో రెండు ఎలుగుబంట్లు వీరంగం సృష్టించాయి. తోటలకు పనులకోసం వెళ్లేవారిపై దాడికి యత్నించాయి. వారంతా కేకలు వేస్తు పరుగులు తీసి తప్పించుకున్నారు. కాగా గత ఏడాది ఎర్రముక్కాం, దున్నూరుతోపాటు వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎలుగుల దాడిలో పలువురు మృతి చెందిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు గ్రామాల్లో రాత్రీపగలు ఎలుగులు సంచరిస్తుండడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. జీడితోటలు శుభ్రం చేసే పనులకు పగలు కూడా వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.


చికిత్స పొందుతున్న పాపారావు


నారాయణపురం వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

బంగారం కోసమే వ్యాపారి హత్య

- రామిగెడ్డలో దొరికిన మృతదేహం
- కారు డ్రైవరే కీలక పాత్రధారి
- అతడి స్నేహితుడి సాయంతో..

నరసన్నపేట/శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి(కొరియర్) పొట్నూరు వెంకటపార్వతీశం గుప్త హత్యకు గురైనట్టు పోలీసులు నిర్ధారించారు. శ్రీకాకుళం మండలం పెద్దపాడు పంచాయతీ తంగివానిపేట వద్ద రామిగెడ్డలో శుక్రవారం ఆయన మృతదేహం బయట పడింది. గత నెల 26న గుప్త హత్యకు గురికాగా.. తను కనబడలేదంటూ కుటుంబ సభ్యులు 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు అనుమానితులను విచారణ చేపట్టారు. గుప్త మృతదేహం కోసం రెండు రోజులుగా గాలించారు. శుక్రవారం రామిగెడ్డ వద్ద మృతదేహం కనిపించడంతో (మిగతా 6వ పేజీలో..)


గుప్త మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు

వరకట్నపు వేధింపులు
- పెళ్లయిన నాలుగు నెలలకే యువతి ఆత్మహత్య

రేషన్ అక్రమాలకు చెక్
- 15 నుంచి డీలర్లకు ఈ-పోస్ యంత్రాలు అందజేత

ఆస్తికి హక్కుపత్రం
- గ్రామాల్లో చురుగ్గా స్వామిత్వ సర్వే

6లో

నా భర్తకు ఏమైందో?

- ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు
- ఆరేళ్లుగా ఎలాంటి సమాచారం లేదు
- ఆచూకీ తెలియజేయాలని భార్య ఢిల్లమ్మ ఆవేదన


ఢిల్లమ్మ

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'ఉపాధి కోసం నా భర్త సానా రాజేష్ పదేళ్ల కిందట దుబాయ్ వెళ్లారు. 2019 జూన్ వరకు నిత్యం ఫోన్‌లో మాట్లాడేవారు. మా ఖర్చులకు డబ్బులు పంపించేవారు. తర్వాత ఏమైందో.. ఇప్పటివరకు ఆయన నుంచి ఫోన్ సమాచారం రాలేదు. ఆరేళ్లగా ఆయన ఆచూకీ కోసం ఎదురు చూస్తున్నామ'ని వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామానికి చెందిన సానా ఢిల్లమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులకు ఆమె గోడు చెప్పుకున్నారు. 'కూలి చేస్తూ.. కుమార్తెతో కలిసి జీవిస్తున్నాను. గతంలో నా భర్త రాజేష్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారు. జీతం చాలక పోవడంతో పదేళ్ల కిందట ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు. ఫోన్‌లో తరచూ మాట్లాడుతూ.. మా ఖర్చుల కోసం డబ్బులు పంపేవారు. కానీ గత ఆరేళ్ల నుంచి ఆయనకు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వస్తోంది. ఇన్నాళ్లూ ఆయన క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారని ఎదురుచూశాం. కానీ ఇంత వరకూ ఎలాంటి క్షేమ సమాచారం లేక పోవడంతో ఏమైందోనని భయాందోళన చెందుతున్నాం. అధికారులు, నాయకులు స్పందించి నా భర్త ఆచూకీ చెప్పాల'ని ఢిల్లమ్మ వేడుకున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముస్లింలు శుక్రవారం మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇస్లాం మత స్థాపకుడైన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఆయన చేసిన త్యాగాలు, సేవలను ఇమామ్‌లు ముస్లింలకు వివరించారు. మహ్మద్ ప్రవక్త బాటలో నడవాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో సుమారు 5వేల మంది ముస్లింలు జామియా మసీదు నుంచి డేఅండ్‌నైట్ జంక్షన్ వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. మతసామరస్యాన్ని కాపాడాలని కోరారు. ర్యాలీలో మహ్మద్ రఫీ, మహిబుల్లాఖాన్, ఇమామ్‌వాహబ్, షాన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ముస్లిం శాంతి ర్యాలీ

ఆస్తికి | గ్రామాల్లో చురుగ్గా స్వామిత్వ సర్వే | గ్రామకంఠం భూములకు హక్కులు | రాజముద్రతతో ఇచ్చేందుకు చర్యలు | ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో హర్షం

హక్కుపత్రం

నరసన్నపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోంది. జిల్లాలో 45 శాతం నివాసాలకు యజమానుల వద్ద ఆస్తి పత్రాలు లేవు. దీంతో క్రయవిక్రయలకు అవకాశం లేకుండా పోయింది. గ్రామ కంఠం భూములకు కొనుగోలు చేసినా వాటిలో నిర్మాణాలు చేపడితే బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేయడం లేదు. దీంతో గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు ఆస్తి హక్కు లేకపోవడంతో యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు స్వామిత్వ సర్వే చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే గ్రామాల్లో 75శాతం సర్వే పూర్తయినట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.



పరిష్కారం దిశగా..

గ్రామకంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారసుల పేర్లపై బదలాయింపు జరగడం లేదు. ఈ నేపథ్యంలో స్వామిత్వ సర్వే ద్వారా ముందు రెవెన్యూ, ఆయా గ్రామాల హద్దులు గుర్తిస్తున్నారు. అనంతరం చెరువులు, పాఠశాలలు, రహదారులు, పార్కులు, దేవాలయాలు, అంగన్‌వాడీ, ఆరోగ్యకేంద్రాలను నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రజలు కట్టుకున్న గృహాలకు డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి హద్దులను నిర్ణయిస్తున్నారు. అనంతరం పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇంటి యాజమాని పేరు, ఇంటి నెంబరు, ఎప్పుడు నిర్మించుకున్నారు? తదితర వివరాలు సేకరిస్తున్నారు.

విక్రయానికి అవకాశం

సర్వే అనంతరం ఇంటి యజమానికి ఆస్తిహక్కు కార్డులు అందజేస్తారు. ప్రతికార్డుకు పీపీఎన్ (ప్రాపర్టీ పార్శిల్ నెంబరు) కేటాయిస్తారు. ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇందులో యాజమాని పూర్తి వివరాలు ఉంటాయి. వివరాలను ఆన్‌లైన్‌లోనూ నమోదు చేస్తారు. ఇంటర్‌నెట్‌లో ఈ వివరాలు ఎప్పుడైనా చూసుకోవచ్చు. కుటుంబ అవసరాల కోసం విక్రయించుకోవచ్చు. బ్యాంకుల నుంచి రుణాలు పొందొచ్చు.



దశమంతుపురంలో స్వామిత్వ సర్వే చేపడుతున్న పంచాయతీ, ఇంజనీరింగ్ సిబ్బంది

జిల్లాలో ఇలా..

జిల్లాలో 30 మండలాల్లో 912 పంచాయతీలు, 1,868 రెవెన్యూ గ్రామాల పరిధిలో 3,389 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 5,72,382 ఇళ్లు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 1,08,948 ఇళ్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గ్రామాల్లో గ్రామకంఠం సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం 2021లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికల ముందు జిల్లాలో తొలివిడతలో 191 రెవెన్యూ గ్రామాల్లో వివరాలు సేకరించి 22,496 మందికి భూహక్కు పత్రాలు అందించారు. ప్రస్తుతం 500 పంచాయతీల్లో రెండో విడత సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో 191 పంచాయతీల్లో చేపట్టిన స్వామిత్వ సర్వే చాలావరకు అంతా తప్పుల తడకగా సాగింది. అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలపై జగన్ బొమ్మ ముద్రించారు. వీటి దిద్దుబాటుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రాజముద్రతో పత్రాలు ఇచ్చేందుకు సర్వే సాగుతోంది.

తప్పులు లేకుండా పత్రాలు అందజేస్తాం:

స్వామిత్వసర్వేలో గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తాము. హక్కుల పత్రాలు ఎటువంటి తప్పులు లేకుండా జారీ చేస్తాం. ఈమేరకు పంచాయతీ సిబ్బందికి డిప్యూటీ ఎంపీడీవో ద్వారా ఆదేశాలను ఇచ్చాము. ఈ సర్వేను దీపావళికి పూర్తి చేసి హక్కు పత్రాలను అందజేస్తాం.

- కె.భారతీసౌజన్య, డీపీవో

నీటిలోనే పంట పొలాలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు.. ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక్క రోజు కురిసిన వర్షానికే మండలంలోని అనేక గ్రామాల్లో పొలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కోటబొమ్మాళి, నందిగాం, పాతపట్నం, మెళియాపుట్టి, టెక్కలి, సారవకోట, జలుమూరు మండలాల నుంచి వరదనీరు గరీబులగెడ్డ, ఏనుగుల గెడ్డ, సందెమ్మ గెడ్డల ద్వారా మండలంలోని తంపరకు చేరి.. అక్కడి నుంచి భావనపాడు వద్ద సముద్రంలో కలుస్తుంది. కొల్లిపాడు, మేఘవరం, ఆకాశలక్కవరం తదితర గ్రామాల్లో తంపరకు అనుకొని రొయ్యల చెరువులు అక్రమంగా వెలిశాయి. దీంతో వరదనీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి నీరు పంట పొలాల్లోకి చేరుతోంది. దీనికి తోడు మూలపేట పోర్టుకు తంపరలో వేసిన రహదారి నీటి ప్రవాహానికి అడ్డంగా ఉండడంతో వరదనీరు పొలాలను ముంచెత్తింది. దీంతో కాకరాపల్లి, అంట్లవరం నగిరిపెంట, గొదలాం, కొల్లిపాడు, మరువాడ, వడ్డితాండ్ర, మేఘవరం, పాతమేఘవరం, సందిపేట, లింగూడు, సున్నాపల్లి, ఆకాశలక్కవరంతో తదితర గ్రామాల్లో వరిపంట ముంపులో చిక్కుకుంది. ఒక్క రోజు కురిసిన వర్షానికే ఇంత ముంపు సంభవించిందని.. వర్షాలు తీవ్రమైతే తమ పరిస్థితి ఏమిటని మండల రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి అక్రమ రొయ్యల చెరువులను తొలగించడంతో పాటు పోర్టు రోడ్డుకు నీటి ప్రవాహానికి పెద్ద కల్వర్టులు ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.



పాతమేఘవరం వద్ద వరదనీటిలో పొలాలు



శంకుస్థాపన సరే.. పనులేవీ?

- ఏడాది కావస్తున్నా ముందుకు కదలని వైనం..
- ఇదీ కొర్లాం విద్యుత్ ఉపకేంద్ర ఆధునికీకరణ పరిస్థితి

సోంపేట రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లాంలో విద్యుత్ ఉపకేంద్ర ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నా ముందుకుసాగడం లేదు. వినియోగదారులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కొర్లాంలో సుమారు 80 లక్షల వ్యయంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ 33/11 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుచేసింది. సోంపేట మండలంలోని సుమారు 30 గ్రామాలకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. విద్యుత్ వినియోగదారుల సంఖ్య రోజుకు పెరుగుతుండడంతో వేసవికాలంలో లోఓల్టేజ్ సమస్యతో తలెత్తుతోంది. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.54.22 కోట్లు అంచనా వ్యయంతో 133/33 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ముందుకొచ్చింది. ఈ పనులకు గత ఏడాది నవంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్ఛాపురం నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అయితే తర్వాత పనులు చేపట్టడంలో అధికారులు దృష్టిసారించలేదని విమర్శలొస్తున్నాయి. ఈ పనులు పూర్తయితే కవిటి, సోంపేట, మందస, కంచిలి మండలాల్లోని గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీరుతుంది. ప్రస్తుతం పలాస, ఇచ్ఛాపురంలో 133/33 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇవి 50 కిలోమీటర్ల పరిధికి దాటి ఉండడంతో సక్రమంగా విద్యుత్‌సరఫరా కావడంలేదు. కాగా పనులు జాప్యానికి గల కారణాలను ట్రాన్స్‌కో అధికారులకు అడిగి తెలుసుకొని వీలైనంత త్వరగా ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. అలాగే సబ్‌స్టేషన్ పనులు పూర్తయితే లోఓల్టేజ్ సమస్య తీరడంతో పాటు ఈ ప్రాంతంలో ఉన్న రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా అవుతుందని కొర్లాం సర్పంచ్ రాంబుడ్డి రమణమ్మ చెప్పారు.

- 133/33 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు టెండర్లు పిలిచామని, ఎవరూ ముందుకు రాలేదని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలియజేశారు. కొద్దిరోజుల్లోనే రీటెండర్లు పిలుస్తామని చెప్పారు.

రేషన్ అక్రమాలకు చెక్

15 నుంచి డీలర్లకు ఈ- పోస్ యంత్రాలు అందజేత



కోటబొమ్మాళి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ బియ్యంతో పాటు నిత్యావసరాలు సక్రమంగా అందజేయాలన్న లక్ష్యంతో పాటు పంపిణీలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టగా, డీలర్లకు ఈ- పోస్ యంత్రాలు అందజేయనుంది. ఈ నెల 15 నుంచి కొత్త యంత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సాంకేతిక సమస్యలకు చెక్

గతంలో డీలర్లకు అందజేసిన ఈ- పోస్ యంత్రాలు సక్రమంగా పనిచేయక రేషన్ బియ్యం సకాలంలో తీసుకోలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక కొందరు డీలర్లు సాంకేతిక సమస్యల సాకుతో బియ్యం పంపిణీ సజావుగా చేయకపోవడంతో కార్డుదారులు వెనుదిరిగి వెళ్తున్న ఘటనలు అనేకం. శివారు గ్రామాల్లో ఇంటర్నెట్ సక్రమంగా పనిచేయక రోజులు తరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాసేవారు. ఇలాంటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ఈ - పోస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

క్యూఆర్ కోడ్‌లోనే వివరాలు

ప్రభుత్వం నూతనంగా ఇస్తున్న స్మార్ట్‌కార్డులోని క్యూఆర్ కోడ్‌ను ఈ- పోస్ యంత్రంలో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు ఏఏ సరకులు ఇవ్వాల్సి ఉందో నమోదవుతాయి. కార్డుదారుని వేలిముద్ర పడకుంటే ఐరిస్ ద్వారా స్కాన్ చేసేలా ఈ యంత్రాన్ని రూపొందించారు. ఇకపై కార్డుదారులు తీసుకునే సరకుల వివరాలతో కూడిన రశీదును కూడా అందజేయనున్నారు.

15 నుంచి డీలర్ల చేతికి..

ఈ నెల 15 నుంచి ప్రభుత్వం ఈ - పోస్ యంత్రాలను డీలర్లుకు అందజేయనున్నట్లు కోటబొమ్మాళి సివిల్ సప్లై డీటీ రామచంద్రరావు తెలిపారు. ఈ యంత్రాలతో రేషన్ పంపిణీ సకాలంలో సక్రమంగా జరుగుతుందన్నారు. ఈ- పోస్ యంత్రాలు ఇప్పటికే వచ్చాయన్నారు. ఎలా వినియోగించాలో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవసమాజ నిర్మాణంలోఉపాధ్యాయులే కీలకం



కలెక్టర్, ఎమ్మెల్యే నుంచి అవార్డు అందుకుంటున్న అగ్గున్న త్రినాధరావు

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటం వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్, విద్యాశాఖ అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి నివాళులర్పించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 60 మందికి అవార్డులను కలెక్టర్ చేతులమీదుగా ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఉపాధ్యాయ వృత్తి చాలా ప్రాముఖ్యమైనది. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు నిత్యం కృషి చేయాలి. విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ప్రొఫెసర్, శాస్త్రవేత్త తదితర లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేలా వారి బంగారు భవిష్యత్‌కు పునాది వేయాలి. ఉపాధ్యాయుల మీద అదనపు భారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామ'ని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్య అందించాలి. ఉపాధ్యాయ వృత్తి.. ఉద్యోగం కాదు. ఒక బాధ్యత' అని తెలిపారు. ఇన్‌చార్జి డీఈవో రవిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 60 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సన్మానించామని, వారికి అవార్డులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, సమగ్ర శిక్ష పీసీ ఎస్.శశిభూషణరావు, సాయిప్రసాద్, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు ప్రసాదరావు, ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ఆమదాలవలస మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ గోవిందరావు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మజ్జి కృష్ణారావు..



వి.ఉషారాణి..



బమ్మిడి రాజేశ్వరి..



శరత్‌చంద్ర బెహరా..



పొన్నాడ శ్రీదేవి..



తూముల జగదీష్..

వరకట్నపు వేధింపులు

పెళ్లయిన నాలుగు నెలలకే యువతి ఆత్మహత్య



పూర్ణ (ఫైల్)

ఆమదాలవలస, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేధింపులకు ఓ యువతి బలవన్మరణం చెందింది. నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగగా.. గురువారం మృతి చెందింది. ఎస్ఐ సనపల బాలరాజు వివరాల మేరకు.. చిట్టివలసకు చెందిన నవిరి సింహాచలం, పద్మ దంపతుల చిన్న కుమార్తె పూర్ణను పట్టణంలోని ఐజే నాయుడు కాలనీకి చెందిన సాయిపల్లి మధుసూదనరావుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిగింది. వివాహ సమయం పూర్ణ తల్లిదండ్రులు అల్లుడు మధుసూనదరావుకు కొంతమేర కట్న కానుకలు ఇచ్చారు. అయితే అప్పటి నుంచి భర్త, అత్తమామలు మరింత వరకట్నం తీసుకుని రావాలని రోజూ వేధిస్తుండేవారు. దీంతో పూర్ణ అత్తవారి ఇంట వేధింపులు తాళలేక చిట్టివలస చేరుకుంది. గతనెల 17న తల్లిదండ్రులతో కలిసి ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో పూర్ణ భర్త, అత్తమామలపై వరకట్నం వేధింపులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. తర్వాత గ్రామపెద్దలు ఇరువర్గాల మధ్య కూర్చో బెట్టి భార్యాభర్తలతో మాట్లాడారు. అయినా పూర్ణను మళ్లీ అత్తవారింట వరకట్న వేధింపులు చేయడంతో చిట్టివలస లోని కన్నవారి ఇంటికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పూర్ణ ఈనెల రెండో తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పూర్ణ తండ్రి నవిరి సింహాచలం ఫిర్యాదు మేరకు వరకట్నం వేధింపుపై శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద కేసు నమోదు చేశారు. ఆమదాలవలస తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించారు. పూర్ణ మృతి చెందడంతో తల్లిదండ్రులు సింహాచలం, పద్మ రోదిస్తున్నారు.

బంగారం కోసమే వ్యాపారి హత్య

(ఐదో పేజీ తరువాయి)

శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, రూరల్ సీఐ పైడిపునాయుడు, నరసన్నపేట పోలీసులు వెళ్లి పరిశీలించారు. గుప్త సోదరుడు మన్మథరావు కూడా మృతదేహాన్ని పరిశీలించి తన సోదరుడేనని నిర్ధారించారు. పొలాల మధ్య కాలువల్లో లభించిన మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. హత్య కేసులో నిందితులను త్వరలో అరెస్టు చేయనున్నారు.



గుప్త (ఫైల్)

ఏమి జరిగిందంటే..

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గుప్త హత్య కేసులో కారుడ్రైవర్ సంతోష్, అతని స్నేహితుడు పెద్దపాడులోని కారు డెకార్ యాజమాని కీలకంగా వ్యవహరించారు. ఈ నెల 26న కారుడ్రైవర్ సంతోష్‌తో కలిసి గుప్త విశాఖ వెళ్లారు. అక్కడ నుంచి రూ.2కోట్ల విలువైన బంగారు బిస్కెట్లను తీసుకొస్తుండగా, వాటిని కాజేసేందుకు పథకం ప్రకారం గుప్తను హతమార్చాలని భావించారు. ఈ క్రమంలో పెద్దపాడు వద్ద కారును సర్వీసు రోడ్డువైపు మళ్లించారు. ఆ సమయంలో వర్షం పడడంతో గుప్తను కారు డెకార్ షాపులోకి తీసుకెళ్లారు. గుప్త మెడకు వైరు బిగించి హతమార్చినట్లు తెలుస్తోంది. కారులో బంగారు ఆభరణాలను డ్రైవర్ సంతోష్ ఇంటికి తీసుకెళ్లి భార్యకు ఇవ్వగా అందులో కొన్ని ఆభరణాలను బొరిగివలసకు చెందిన ఓ యువకుడికి ఇచ్చి భద్రపరచాలని ఆమె కోరారు. తర్వాత కారును గుప్త ఇంటికి డ్రైవర్ అప్పగించేశాడు. నాలుగు రోజులుగా గుప్త ఆచూకీ లేకపోవడంతో గత నెల 31న ఆయన సోదరుడు మన్మథరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. కాగా ఆ రోజు హత్య జరిగిన తర్వాత గుప్త మృతదేహాన్ని పాత్రునివలస వద్ద రామిగెడ్డలో వేయగా.. వర్షాల కారణంగా అది సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో కాలువలోకి కొట్టుకువచ్చి.. తంగివానిపేట వద్ద శుక్రవారం లభ్యమైంది.

జిల్లాలో థర్మల్ ప్రాజెక్టు

(ఐదో పేజీ తరువాయి)

తీసుకునేందుకు తరలించేందుకు వెసులుబాటు.. సౌకర్యం ఉంటుందని అధికారులు గుర్తించారు. ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుంచి రైల్వే స్లయిడింగ్ పనులకు అంచనాలు రూపొందించే పనులను రైట్స్ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. అలాగే గత నెల 22న జెన్‌కో ఎమ్‌డీ చక్రధరరావు కూడా ఈ ప్రాంతంలో పర్యటించారు. వెన్నెలవలస వద్ద విద్యుత్ కేంద్రం నెలకొల్పేందుకు సుమారు రెండువేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ కేంద్రం నెలకొల్పితే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

- **రిజర్వాయర్ నుంచి నీటి వినియోగం..**

థర్మల్‌ప్లాంట్ నిర్వహణకు అవసరమైన నీటిని హిరమండలం రిజర్వాయర్ నుంచి వినియోగించుకునేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో పాటు సరుబుజ్జిలికి చుట్టుపక్కల ఉన్న రిజర్వాయర్‌లో నీటి లభ్యత(హైడ్రాలిక్ డేటా)ను జలవనరుల శాఖ అంచనావేసింది. ఈమేరకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే.. నాలుగేళ్లలో పూర్తిఅవుతుందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయితే జిల్లా అభివృద్ధి చెందనుందని భావిస్తున్నారు.

- **ఆటంకాలు లేకుండా.. ముందే గుర్తిస్తే మేలు..**

ఇటీవల కొంతమంది థర్మల్ ప్లాంట్ వద్దంటూ.. ఉద్యమానికి సిద్ధమయ్యారు. చిన్నపాటి చర్చా కార్య క్రమాలు నిర్వహించారు. ఇప్పుడు అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. అంతటా సర్వే చేసి.. ప్రజల ప్రయోజనాలు.. జిల్లా అభివృద్ధి పరంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నాకే ప్లాంట్ నిర్మాణం మొదలు పెడుతుంది. ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్లాంట్ నిర్మాణం ముందుకు సాగాలంటే.. అవాంతరాలను గుర్తించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులది, జిల్లా పోలీసు శాఖదే. థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో ప్రభుత్వం తీసుకునే భద్రతా చర్యలు.. వినియోగించే టెక్నాలజీ.. మారనున్న జిల్లా అభివృద్ధి గురించి సమగ్రంగా వివరిస్తూ సదస్సులను నిర్వహిస్తే అందరికీ అవగాహన కలుగుతుంది. వ్యతిరేక ప్రచారం లేకుండా ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరే అవకాశముంది. జిల్లా ప్రజాప్రతినిధులు ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఫారెస్టు ఆఫీసర్ పరీక్షలకు ఏర్పాట్లు

● పది పరీక్ష కేంద్రాల్లో 5,186 అభ్యర్థులు హాజరు: డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫారెస్టు బీట్ ఆఫీసర్, సహాయ బీట్ ఆఫీసర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం జరిగే పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని, ఫారెస్టు బీట్ ఆఫీసర్, సహాయ బీట్ ఆఫీసర్ పరీక్షలకు 5,186 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.ఉదయం పది నుంచి 12.30 గంటల వరకు ఫారెస్టు బీట్ ఆఫీసర్, సహాయ బీట్ ఆఫీసర్ పరీక్షలకు 4,495 మంది, మధ్యాహ్నం మూడు నుంచి 5.30 గంటల వరకు జరిగే ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 691 మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు శ్రీనివాస్, మల్లిఖార్జునరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

రెండో పట్టణ ఎస్ఐ బదిలీ

శ్రీకాకుళం క్రైమ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ ఎస్.సంతోష్‌కు ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీఅయింది. ఈమేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏఎంసీ చైర్మన్‌గా విజయలక్ష్మి

సోంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్‌గా మద్దిల విజయలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడిగా మద్దుకుమార్, పట్టణాధ్యక్షుడిగా చిత్రాడ శేఖర్, కోదండరామస్వామి ఆలయ చైర్మన్‌గా బీన ఆనంద్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం సోంపేటలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, బిన్నల జగన్నాథం పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 5(సెప్టెంబరు): ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలకు శుభరాట శాస్త్రోత్తంగా వేదపండితులు వేశారు.శుక్రవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో శుభరాట వేశారు. నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

ఇచ్ఛాపురం వాసికి యోగాలో వెండి పతకం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండిపతకం సొంతం చేసుకున్నాడు. గత నెల 29, 30, 31 మూడు రోజులు పాటు నాగపూర్‌లో 23-30 ఏళ్ల గ్రూప్‌లో జరిగిన యోగాపోటీల్లో తన సత్తాచాటాడు. కాగా రామయ్యపుట్టుగ శ్రీకాంత్ మహంతికి విప్,ఎమ్మెల్యే బెందాళం అశోక్ అభినందించారు. కాగా పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమలలో వెస్ట్‌గోదావరి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 50వ రాష్ట్ర యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్-2025పోటీల్లో పాల్గొనేందుకు ఇచ్ఛాపురానికి చెందిన శ్రీకాంత్ మహంతి, పి.సాయిజగదీష్ బయలుదేరివెళ్లారు.

నువాగడలో గణిత దశావధానం

కంచిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నువాగడ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దుర్గాప్రసాద్ పాడి అధ్యక్షతన శుక్రవారం గణిత దశావధానం నిర్వహించారు. ఈసందర్భంగా గణితావధాని మద్దు తిరుపతిరావుకు విద్యార్థులు వివిధ అంశాలపై అడిగిన ప్రశ్నలకు జవాబులు క్షణాల్లో చెప్పి అబ్బురపరిచారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతిరావు, జగన్నాథ్‌బిసో, చంద్రమణి గొమాంగో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓనం పండుగ

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని బలగలో గల అయ్యప్పస్వామి ఆలయంలో ఓనం పండుగ అర్చకులు దేవరకొండ శంకర్ నారాయణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వులతో ముగ్గులు ఆకారంలో లక్ష్మీదేవికి అలంకరించారు. అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల 108 ప్రసాదాలతో స్వామి వారికి పూజలుచేశారు.

మహిళా హెచ్‌సీ మృతి

పొందూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పొందూరు మండలంలోని కనిమెట్టకు చెందిన బగాది రాములమ్మ గురువారం రాత్రి మృతి చెందారు.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములమ్మను మెరుగైన చికిత్సకోసం చెన్నై తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఇటీవలే రాములమ్మకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చింది. రాములమ్మ భర్త అప్పలస్వామి ఎస్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వారు కనిమెట్ట గ్రామంలో నివాసముంటున్నారు. శుక్రవారం కనిమెట్టలో అంత్యక్రియలు నిర్వహించారు. రాములమ్మ మృతికి ఎస్పీ మహేశ్వరరెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. రాములమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

12వ పీఆర్సీని నియమించాలి

● ఏపీ జేఏసీ రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణిపేర్రాజు

గుజరాతీపేట/ అరసవల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):ఉద్యోగుల, పెన్షనర్లకు రావల్సిన బకాయిలు, వాటి వివరాలు వెంటనే పేస్లిప్పులు సీఎఫ్ఎంఎస్‌లో చూపించేలా చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు కోరారు.12వ పీఆర్సీ నియమించాలని డిమాండ్‌చేశారు. శుక్రవారం శ్రీకాకుళంలోని రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు విడుదలచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా చైర్మన్ శ్రీరాములు, క్లాస్-4ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఏపీజేఏసీ మహిళా విభాగం జిల్లా చైర్మన్ కె.ప్రవల్లిక ప్రియ, పొదిలాపుశ్రీను, బైరిరాజు, ఎస్.గోవిందరావు, జె.రామారావు, కాశీప్రసాద్, ఇతర అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డివిజన్ కమిటీల ఎన్నిక

శ్రీకాకుళం సిటీ, శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజనల్ కమిటీలను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళం డివిజన్ చైర్మన్‌గా ఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా పి.రాజశేఖర్, టెక్కలి డివిజన్ చైర్మన్‌గా బి.హేమసుందర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం.రావు, పలాస డివిజన్ చైర్మన్‌గా బి.అప్పలస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పి.కుమార్, మహిళా విభాగానికి సంబంధించి శ్రీకాకుళం సిటీ యూనిట్ చైర్‌పర్సన్‌గా డి.అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా బి.సుభద్ర, డివిజన్ చైర్మన్‌గా డి.వనజాక్షి, కార్యదర్శిగా పి.రాజేశ్వరి, టెక్కలి డివిజన్ చైర్మన్‌గా ఎస్.పవిత్ర, కార్యదర్శిగా ఎస్.అనూష, పలాస డివిజన్ చైర్మన్‌గా ఎస్.కరుణమ్మ, కార్యదర్శిగా బీఎస్ రాణి ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న ఏపీజేఏసీ రాష్ట్ర నాయకుడు ఫణి పేర్రాజు

పర్యవేక్షణ లేక.. పరిశుభ్రతకు నోచుకోక

● రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త ● ఇదీ గొల్లవూరు రహదారిపై పరిస్థితి

సోంపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లవూరు రహదారికి ఇరువైపులా చెత్తపేరుకుపోయింది. ప్రధానంగా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిశుభ్రతకు నోచుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఈ మార్గం గుండా సోంపేట, మందస మండలాల్లోని ఉప్పలాం, సిరిమామిడి, దున్నూరులో మామిడిపల్లి పంచాయతీల పరిధిలోని 20 గ్రామాల ప్రజలు ప్రతి పనికి సోంపేట వస్తుంటారు.రెండు నెలలుగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసన వెలువడుతోందని పలువురు వాపోతున్నారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా బహిర్భూమికి మార్చేయడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని గొల్లవూరుతో పాటు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.కాగా పంచాయతీలో నిధులు లేక ఐదు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో చెత్తతొలగించడంలేదని గొల్లవూరు సర్పంచ్ పిన్నింటిఈశ్వరరావు తెలిపారు. చెత్తతొలగించాలని పంచాయతీకార్యదర్శికి కోరినట్లు చెప్పారు.



గొల్లవూరు రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండరోడ్డులో వినాయకుని ఊరేగిస్తున్న భక్తులు



పాతపట్నం: దువ్వారవీధిలో వినాయక విగ్రహం ఊరేగింపులో జానపద నృత్యాలు చేస్తున్న మహిళలు



జలుమూరు: చల్లవానిపేట కూడలిలో ఆటపాటలతో వినాయకుని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

కోలాహలంగా గణనాథుల నిమజ్జనం

● లడ్డూ వేలంపాటలు ● పోలీసుల బందోబస్తు ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా గణనాథుల నిమజ్జనాలు శుక్రవారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపుతో ప్రధాన రహదారులు కిటకిటలాడాయి.నాగావళి, వంశధార నదులతోపాటు చెరువులు, కాలువల్లో పెద్దసంఖ్యలో విగ్రహాలను నిమజ్జనంచేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల అన్నదాన కార్య క్రమాలు ఏర్పాటుచేశారు.

● శ్రీకాకుళం కల్చరల్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో కొలువుదీరిన గణనాథుని అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక రథం వెనుక 108 మంది గణపతి మాలాధారణలో ఉన్నవారు స్వామివారికి వింజామరులతో ఊరేగించారు. కేరళ నుంచి తెప్పించిన డ్రమ్స్ డాన్స్ ఆకట్టుకుంది.

● పలాస/కాశీబుగ్గ,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీపరిధిలోగల సీతారామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తిగణపతి ఆలయం వద్ద వినాయకుడి లడ్డు ప్రసాదం రూ. 51,111కు పలికింది. శుక్రవారం నిర్వహించిన పాటలో జేసీహెచ్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. మొత్తం 90 మంది వేలం పాటలో పాల్గొన్నారు.అలాగే కాపువీధిలోఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, నర్సింహులు, రాంబాబు పాల్గొన్నారు.

● పాతపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలో వినాయక విగ్రహాల నిమజ్జనం పురస్కరించుకుని ప్రధాన రహదారులు కిటకిటలాడాయి.స్థానిక దువ్వారవీధిలో వినాయకలడ్డూను వేలంలో బెవర యక్షిత్ రూ.44వేలకు దక్కించుకున్నారు.

● నందిగాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):నందిగాంతోపాటు వివిధ గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు సందడిగా సాగాయి. నందిగాంలోని కారిగుడ్డివీధి, ప్రగడవీధి కూడళ్లలో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమలను యువత ఆటపాటల మధ్య ఊరేగించారు. అనంతరం స్థానిక పూడి చెల్లెమ్మ కోనేరులో నిమజ్జనం చేశారు. ప్రగడవీధిలోని వినాయకుని లడ్డూను ప్రగడ తిరుపతిరావు రూ.35,500కు వేలంలో దక్కించుకున్నారు.

● జలుమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆటపాటలు, వివిధ వేషధారణలతో ఊరేగించారు. అనంతరం వంశధార కాలువలో స్వామి వారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

● ఇచ్ఛాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని బెల్లుపడ రెయ్యివీధి వినాయక మండపం వద్ద లడ్డూను చాట్ల సుజాత రూ.24వేలుకు దక్కించుకున్నారు.కార్యక్రమంలో చాట్ల తులసీదాస్‌రెడ్డి, రామిరెడ్డి, లోహిదాస్‌రెడ్డి, సత్యవతి పాల్గొన్నారు

● జి.సిగడాం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతపెంట, పెంట తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు.

ఊరేగింపులో అతిగా ప్రవర్తిస్తే చర్యలు : సీఐ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాల ఊరేగింపులో మద్యం తాగి అతిగా ప్రవర్తించి ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ వినాయక నిమజ్జనాల్లో పూర్తిగా డీజేలు నిషిద్ధమని, డీజేలు ఊరేగింపుల్లో వాడితే చట్టపరమైన చర్యలుతప్పవని హెచ్చరించారు. అశ్లీలనృత్యాలు మండపాల వద్ద నిర్వహించవద్దని తెలిపారు. రాత్రి 11 గంటల్లోపు వినాయక నిమజ్జనాలు ఊరేగింపు ముగించాలని, నదీ పరివాహక ప్రాంతాల్లో మండప కమిటీలు నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. చిన్నారులను ఊరేగింపులకు తీసుకువెళ్లవద్దని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

● పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రవికుమార్

సరుబుజ్జిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం యరగాంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రెయిన్లను ప్రారంభించారు. చినకాగితాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రాజ్యాంగనిర్మాత బీఆర్ అంబేడ్కర్ మాజీ రాష్ట్రపతి డాక్టర్ పీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, తహసీల్దార్ ఎల్.మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టీడీపీనాయకులు గురువు తిరుమలరావు, కిల్లి సిద్దార్థ, పల్లి సురేష్, నూక కోటేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు సింహాచలం పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



సహజ ఉత్పత్తుల వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలోని రైతు బజారు వద్ద డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మూడు సేంద్రియ ఉత్పత్తుల మొబైల్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా కంపోస్టు, పచ్చిరొట్ట వంటి జీవాధార ఎరువులతో పంటలు పండించాలని కోరారు. ప్రజారోగ్య రక్షణ ప్రభుత్వ బాధ్యతని, సహజ ఉత్పత్తులను ప్రోత్సహించడం, వాటిని ప్రజలు వినియోగించేలా చేయడం తమ కర్తవ్యమన్నారు.

చండిపుట్టుగలో కంటి వైద్యశిబిరం

కవిటి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చండిపుట్టుగలో శుక్రవారం సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కంటివైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా 80మంది పరీక్షలు నిర్వహించి 30మందికి కళ్లజోళ్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఎం.లక్ష్మణరావు, ఆర్.శ్రీనివాసరావు, వి.ఆకాష్ పాల్గొన్నారు.

జిల్లాకు 11 నూతన 108 వాహనాలు

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



108 వాహనాలను ప్రారంభిస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రణస్థలం, లావేరు మండలాల్లో వివిధ ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలందించేందుకు 108 వాహనాలు దోహదపడతాయని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం రణస్థలంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రెండు 108 అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 108 అత్యవసరసేవల్లో భాగంగా జిల్లాకు 11నూతన 108 వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 108 జిల్లా సమన్వయకర్త ప్రకాష్, రీజినల్ మేనేజర్ ఎల్.నవీన్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

లావేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):లావేరు పంచాయతీ పరిధిలోని కేశవరాయపురానికి చెందిన ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొరను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరామర్శించారు. తోటయ్యదొర ఇటీవల జారీ కింద పడడంతో గాయపడిన విషయం విదితమే.

మురపాక మండలం ఏర్పాటుకు సహకరించండి

లావేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మురపాక మండలం ఏర్పాటుకు సహకరించాలని మండల సాధన సమితి సభ్యులు కోరారు.ఈ మేరకు శుక్రవారం ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలిలో జడ్పీటీసీ బల్లాడ హేమామాలినిరెడ్డి, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దన్‌రెడ్డిలను కలిశారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

రణస్థలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం రణస్థలంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రణస్థలం ప్రాజెక్టు మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాతపట్నంలో ఈనెల 14న జరిగే అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సుజాత, ఎస్. వెంకటలక్ష్మి, బి. అప్పమ్మ, పి. నాగమణి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ స్పందించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పీపుల్స్ లోక్‌సత్తా ఎన్నారై విభాగం అధ్యక్షుడు ప్రకాష్ కపిల్ కోరారు. శుక్రవారం మండలంలోని బెలమాం, లొద్దలపేటలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు పంచాది రాంబాబు మాట సంస్థ ఆధ్వర్యంలో టేకు మొక్కల పంపిణీచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనుగుల కిషోర్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటు

పొందూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాపాకలో తాగునీటి ట్యాంక ఏర్పాటుచేశారు. ఇక్కడ ఎస్సీ కాలనీలో నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు తీసుకువెళ్లడంతో ప్రత్యేకనిధులు మంజూరుచేశారు. ఈనిధులతో ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైన్ల ఏర్పాటుచేసి ఇంటింటికి నీటి సరఫరా ప్రారంభించారు. కార్యక్రమంలో బలగ శంకరభాస్కర్, ఖండాపు శ్రీనివాసరావు, గొల్లయ్య, కొంచాడ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీపై దృష్టి సారించండి

గార రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా ఆర్బీకేలు, వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు సరఫరా అవుతున్న ఎరువుల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై వ్యవసాయాధికారులు దృష్టి సారించాలని టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జల్లు రాజీవ్ కోరారు. శుక్రవారం మండలంలోని కుమ్మరిపేటలో విలేకరులతో మాట్లాడుతూ పర్యవేక్షణలోపం వల్ల సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు లోనై పెద్ద రైతులకు అధిక సంఖ్యలో యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో సన్న, చిన్నకారు రైతులకు ఎరువుల అందక తీవ్ర ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి భారీస్థాయిలో ఎరువులు దిగుమతి అవుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు ఎరువుల ఇబ్బంది తప్పడం లేదని, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

తాడివలసలో యూరియా విక్రయం

పొందూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాడివలస, మజ్జిలపేటలో శుక్రవారం వ్యవసాయఅధికారులు పోలీసుల సమక్షంలో యూరియాను విక్రయించారు. యూరియాకోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో తాడివలస గ్రామానికి 176,మజ్జిలపేట గ్రామానికి 158 యూరియా బస్తాలను అధికారులు మంజూరు చేశారు.

సమాజంలో ఉపాధ్యాయులదే ఉత్తమ స్థానం


ఎంఈవోలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఆమదాలవలస: సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

జలుమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉత్తమ స్థానం ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులదే అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి.. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడేలా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, చల్లవానిపేట, అల్లాడ సొసైటీ చైర్మన్లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దత్తుబాబు, ఎం.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సమాజ రూపశిల్పి ...

నరసన్నపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు సమాజ రూపశిల్పి అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన గురుపూజోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు, డా, గొలివి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గురువుదే అగ్రస్థానం...

ఆమదాలవలస, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో గురువుదే అగ్రస్థానమని పీయూసీ చైర్మన్ ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే రవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూకరాజు, తమ్మినేని అప్పలనాయుడు, దుప్పల గణపతి, తమ్మినేని చంటి, శ్రీనివాసరావు, సీతారాం పాల్గొన్నారు.

- రణస్థలం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తనకు అక్షరాభ్యాసం చేయించిన గురువు మేడూరి సత్యనారాయణను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎంఎస్ఎన్‌మూర్తి, సత్యవతి దంపతుల ఆశీర్వాదం తీసుకొని, వారికి పట్టు వస్త్రాలు అందజేశారు.
- గార రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళింగపట్నం కోకావారి జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహణ కమిటీ సభ్యులు అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ సభ్యులు పొట్నూరు వైకుంఠరావు, లిటిల్‌స్టార్ విద్యాసంస్థ అధినేత టీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.
- పలాస, సెప్టెంబరు 5 త(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాజీ నగర్ మదర్‌థెరిసా విద్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ వజ్జ గంగాభవాని, ఏపీ ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువుతోనే అంతా ముడిపడి ఉందని, వారు నేర్పిన విద్యవల్లే వికాసం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రణస్థలం: గురువు సత్యనారాయణ నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


పలాస: విశ్రాంత అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వజ్జ భవాని, బాబూరావు, ఉపాధ్యాయులు


గార రూరల్: అధ్యాపకుడు రామారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన వెంకటరమణ

పలాస, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాత జాతీయ రహదారి సరియాపల్లి గ్రామ కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామానికి చెందిన టి.వెంకట రమణ(35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి దాన్ని ఢీకొనడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది ఆయన్ను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఆయనకు భార్య నేములమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీలకు అప్పగించారు. ఈ మేరకు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో స్నానానికి దిగిన రైతు..


రాజు (ఫైల్)

ఎచ్చెర్ల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రైతు చల్ల రాజు (44) శుక్రవారం చెరువులో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాజు తన పొలానికి పురుగుల మందు పిచికారీ చేసి తిరిగి వస్తూ దారిలోని లంకెల కోనేరులో స్నానానికి దిగాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండా నీరు చేరింది. స్నానానికి దిగిన రాజు గోతిలో జారిపోయి బయటకు రాలేక మునిగిపోయాడు. అదే సమయంలో కొద్ది దూరంలో స్నానం చేస్తున్న కొంతమంది రాజు బయటకు రాకపోవడాన్ని గమనించారు. ఆయన బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. రైతుకు భార్య భారతి, కుమార్తె రమ్య, కుమారుడు ఢిల్లీశ్వరరావు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


తాతయ్య (ఫైల్)

ఆమదాలవలస, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో గల తొమ్మిదో వార్డు మెట్టక్కివలసకు చెందిన బరాటం తాతయ్య (51) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని శ్రీదేవి థియేటర్ సమీపంలోని లక్ష్మీనగర్ శ్మశాన వాటిక విశ్రాంతి భవనంలో ఆయన మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ బాలరాజు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుప త్రికి తరలించారు. ఈ ఘటనపై తాతయ్య భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగి ఒకరు..

హిరమండలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హిరమండలం గాంధీనగర్ వీధికి చెందిన లోపింటి అప్పారావు గురువారం అతిగా మద్యం తాగడంతో మృతిచెందాడు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం అప్పారావు డప్పులు వాయిస్తూ... కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. గురువారం రాత్రి మద్యం తాగి తన ఇంటి సమీపంలోని నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనంలో పడిఉన్నాడు. కుమారుడు లోపింటి సింహాచలం శుక్రవారం ఉదయం తండ్రి అప్పారావును నిద్రలేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. దీంతో 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో స్కూటీపై వెళ్తున్న ఓ మహిళను వెనుక నుంచి వచ్చిన ద్విచ క్రవాహనం ఢీకొనడంతో ఆమె గాయపడింది. ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీ జంక్షన్ సమపంలో ఓ మహిళ స్కూటీపై వెళ్తోంది. వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆ మహిళకు కుడికాలికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని స్కూటీని ఢీకొట్టిన ద్విచ క్రవాహన చోదకుడికి డ్రంక్ అండ్ టెస్ట్ చేశారు. గాయపడిన మహిళను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

బంగారు ఆభరణాల చోరీ

రణస్థలం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రణస్థలం లక్ష్మీనగర్ కాలనీలో నివాసముంటున్న ఒరిగింటి అరుణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బంగార ఆభరణాలు, నగదు చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. చీపురుపల్లి మండలంలోని బొండపల్లి స్వగ్రామానికి అరుణ కుటుంబ సభ్యులతో ఈనెల మూడో తేదీన వెళ్లారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ఆమె మరిది ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు విరిగి ఉన్నాయి. బీరువ తెరిచిఉంది. వెంటనే తన సోదరుడు డేవిడ్‌రాజుకు సమాచారం ఇచ్చాడు. దీంతో రెండున్నర తులాల బంగార ఆభరణాలు, రూ 50 వేలు నగదు పోయినట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని ఫింగర్ ప్రింట్స్ పరిశీలించింది. బాధితురాలు ఒరిగింటి అరుణ జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

కొత్తూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తనను కులం పేరుతో దూషించారని కొత్తూరు మండలం బలద గ్రామానికి చెందిన మంతెన అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కొత్తూరు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. తన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వలురౌతు గోవిందరావు, వలురౌతు వాసుదేవరావు, బోరాడ రామారావు, హిందూవర్దన్, పోరాడ శంకరావులు అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి సెంట్రింగ్ కర్రలు తొలగించటంతో అడ్డుకున్న తనను కులం పేరుతో దూషించి, బెదిరించారని పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

ఉర్లాం వీఏఏపై పోలీసులకు ఫిర్యాదు

నరసన్నపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల డబ్బులు స్వాహా చేసిన ఉర్లాం సచివాలయ వ్యవసాయ సహాయకులు గొల్లపల్లి భాస్కరరావుపై పంచాయతీ కార్యాదర్శి రవికుమార్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎరువులు ఇప్పిస్తానని రైతుల నుంచి డబ్బులు వసూలు చేయడం, పింఛను మొత్తాన్ని సొంతానికి వినియోగించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు భాస్కర రావును సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

పంట పొలాలు పరిశీలన

సంతబొమ్మాళి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మరువాడ పంచాయతీలో వరదముంపులో ఉన్న వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి రాశ్లపాటి అప్పారావు శుక్రవారం పరిశీలించారు. తొలిదశలో ఉన్న వరిపంట వరదనీటిలో ఉండిపోవడం వల్ల కుళ్లిపోయిందని రైతులు తెలిపారు. టీడీపీ రైతు ప్రతినిధులు సూరాడ ధనరాజ్, సూరాడ దాసురాజ్, మేరుగు నూకయ్య తదితరులు వ్యవసాయాధికారికి పంట పొలాలను చూపించారు.

నివగాంలో పీడీఎస్ బియ్యం స్వాధీనం


బియ్యం తరలిస్తున్న వాహనాలతో అధికారులు

కొత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నివగాంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్టు సివిల్ సప్లయిస్ డీటీ సీహెచ్ భీమారావు తెలిపారు. స్థానిక సత్యనారాయణ రైసు మిల్లు వద్ద అక్రమంగా బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందుకున్న అధికారులు దాడులు చేశారు. సుమారు 21 టన్నుల అక్రమ బియ్యం పట్టుకున్నారు. వీటితో పాటు బొలేరో వాహనంలో తరలింపునకు సిద్ధంగా ఉన్న బియ్యం కూడా పట్టుకున్నట్టు తెలిపారు. రైసుమిల్లు యజమాని ఇప్పిలి గోవిందరావు, వ్యాపారులు గండిమి రవి, సవర విజయ, సవర కామేష్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో సీఎస్‌డీటీ సూర్యప్రకాశ్, వీఆర్వోలు నారాయణరావు, రాజగోపాలరావులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.3 లక్షల సాయం


రాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న నాగేశ్వరరావు

జలుమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సురవరం గ్రామానికి చెందిన అల్లు రాజు మాస్టారు కుటుంబానికి చల్లవానిపేట విజ్ఞానదుర్గ హైస్కూలు విద్యార్థులు, సిబ్బంది రూ. రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించారు. రాజు మాస్టారు విజ్ఞానదుర్గ హైస్కూలులో 18 సంవత్సరాలు పని చేశారు. మూడేళ్ల కిందట మినిమం టైం స్కేలు (ఎం.టి.ఎస్.) ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. శ్రీముఖలింగం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తూ 3 నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. దీనిపై స్పందించిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం రాజు భార్య మోహినికి ఆర్థిక సాయం అందించారు. ఈకార్యక్రమంలో టెక్కలి ఐతమ్ ఇంజనీరింగు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రగడ దుర్గారావు, సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, విశ్రాంత అధ్యాపకులు కోన గాలిమోహనరావు, ఉపాధ్యాయులు మెండ రామారావు, చల్ల దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు నడుమ యూరియా పంపిణీ

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):మిరియాపల్లి రైతుసేవా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది పోలీసుల సహకారంతో శుక్రవారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. గతంలో ఈ రైతుసేవా కేంద్రం పరిధిలోని గ్రామాల రైతులకు యూరియా పంపిణీ అగ్రికల్చర్ అసిస్టెంటు మనోహర్ తెలియజేశారు. రెండో విడతగా వంద యూరియా బస్తాలు రావటంతో గతంలో ఇవ్వని వారికి పోలీసుల బందోబస్తు నడుమ పంపిణీ చేసినట్లు చెప్పారు. క్యూలైన్‌లో రైతులకు స్లిప్పులు అందించి... ఆమేరకు ఎరువులు పంపిణీ చేసినట్టు చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ మోజేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఘనంగా కుంకుమ పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

హరిపురం, సెప్టెం బరు 5 (ఆంధ్రజ్యోతి) మఖరజోల గ్రామంలో శుక్రవారం వినాయక మండపం వద్ద మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

నరసన్నపేటలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే


ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న సంపత్‌సాయి కళాశాల యాజమాన్యం

నరసన్నపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సంపత్ సాయి జూనియర్ కళాశాలలో ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వాన స్వాతి, బి.గాయత్రిలను సత్కరించారు. పద్మావతి, శ్రీవిజయం కళాశాలల్లో గురు పూజోత్సవాలు, ఫ్రెషర్స్ డే నిర్వహించారు.

గ్రామాలకు పశువైద్య సేవలు విస్తరించాలి

పాతపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాలకు సంచార పశువైద్య సేవలు అందించేలా చూడాలని పశుసంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలైద సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పాడి రైతులకు 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాలు: ఆర్డీవో

సంతబొమ్మాళి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నౌపడ పునరావాస కాలనీలో లాటరీ పద్ధతి ద్వారా మూలపేట గ్రామస్థులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం నౌపడ పునరావాస కాలనీలో మూలపేట గ్రామస్థులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే విష్ణుచక్రం గ్రామస్థులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. దీంతో వారంతా పునరావాస కేంద్రానికి చేరుకున్నారని తెలిపారు. మూలపేట గ్రామస్థులను 96 క్లస్టర్లుగా విభజించి స్థలాలు కేటాయిస్తామన్నారు. ఉద్దానం ప్రాజెక్టు నుంచి పోర్టు పునరావాస కాలనీకి తాగునీరు అందించేందుకు రూ.రెండు కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి అప్పుడు గ్రామం విడిచి వస్తామని స్థానికులు తెలిపారు. పోర్టు పునరావస కాలనీ మధ్య శ్మశాన వాటిక వద్దని... నౌపడ గ్రామంలో ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు జీరు భీమారావు, సర్పంచ్ జీరు బాబూరావు, గ్రామపెద్దలు నారంనాయుడు, సుందరరావు పాల్గొన్నారు.

అప్పయ్యదొర ఆశయ సాధనకు కృషి

కాశీబుగ్గ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో రాజకీయాలను శాసించే మహ రాజకీయ భీష్ముడు హనుమంతు అప్పయ్యదొర ఆశయాలను కొనసాగించాలని ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో మాజీ ఎంపీ అప్పయ్యదొర వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మురళీ మోహన్, సప్ప నవీన్, దుర్గారావు, సూర్యనారాయణ, రామ్మోహన్‌దొర, విజయ్‌కుమార్ దొర, రాంబాబు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, వైసీపీ నాయకులు అప్పయ్యదొరకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఘన నివాళులు...

నందిగాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): టెక్కలి మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం పార్లమెంట్ మాజీ సభ్యులు హనుమంతు అప్పయ్యదొర వర్థంతి సందర్భంగా శుక్రవారం ఘన నివాళులర్పించారు. మండల కాంప్లెక్స్ ఆవరణలో గల అప్పయ్యదొర విగ్రహానికి వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ కురమాన బాలకృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రముఖుల విగ్రహాలను ఆవిష్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, బి.ఆర్.అంబేడ్కర్, అబ్దుల్ కలాం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.జయమోహన్, మాజీ సర్పంచ్ పోలాకి షణ్ముఖరావు, ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, రట్టి ఆదినారాయణ, పొట్నూరు సూర్యనారాయణ, దారపు రాము, పి.శంకరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మెళియాపుట్టి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆశా వర్కర్లు అన్నారు. చాపర సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, మండల అధ్యక్షురాలు సర్దలత, పద్మావతి, రోజా, కార్యదర్శి పోలాకి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి కార్మికుడికి ఆర్థిక సాయం

పలాస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న జీడి కళాసీ తెలకల కామేష్‌కు జీడి, రైస్‌మిల్ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం రూ.20,500 ఆర్థిక సాయాన్ని అందించారు. కామేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు పోగొట్టుకున్నాడు. కార్మిక సంఘ నాయకులు ఆయనకు సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, గౌరవ అధ్యక్షుడు బొంపల్లి సింహాచలం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఐ బాధ్యతల స్వీకరణ

పాతపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.సన్యాసి నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు సీఐగా పనిచేసిన వానపల్లి రామారావు శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నూతన సీఐని పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు, సిబ్బంది అభినందించారు.

నేడు మండల సమావేశం

మందస, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమలకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు సత్యసాయి ప్రేమతరు కార్యక్రమం

పలాసరూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో సత్యసాయిబాబా 100వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం సత్యసాయి ప్రేమతరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పదివేల మొక్కలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

క్వాంటం కంప్యూటింగ్‌తో నేడు ఐతమ్ ఒప్పందం

టెక్కలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు క్వాంటం సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతున్నందున విద్యార్థులను ఈ క్వాంటం యుగానికి సిద్ధం చేయడంలో ముందువరుసలో నిలుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామి అయిన క్యూపీఐఏఐతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. క్యూపీఐఏఐ ఆధునిక సాంకేతిక సంస్థ. ఇది క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు సమ్మిళిత ప్లాటఫారమ్‌లో ప్రత్యేకత కలిగి ఉంటుంది. క్యూపీఐఏఐ ఎక్స్‌ప్లోరర్, క్యూపీఐఏఐ ప్రో, క్వాంట్రాం-ఏఐ సమ్మిళితం, విద్య, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనా సహకారం వంటి సేవలను అందిస్తుంది.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించండి

కాశీబుగ్గ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మంజుల, సునీతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కాశీబుగ్గలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మావతి, రాజేశ్వరి, నిర్మల, నారాయణి, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.